ISSN 2582-6565

నవ మల్లెతీగ

సకుటుంబ సాహిత్య మాసపత్రిక

జూన్ 2022 | విజయవాడ | పేజీలు : 64 | వెల రు.20/-





జగన్ దావోస్ తనతో తీసుకెళ్ళింది ఏమిటి?

అంతరంగ పర్యావరణాన్నీ కాపాడుకోవాలి

ఈ నెల పరిమళాలు



జగన్ దావోస్ తనతో తీసు కెళ్ళిందేమిటీ 34



సాహసాలకు చిరునామా సాయిపద్మ 52



గన్ పట్టుకోవడం థ్రిల్లింగ్ 21

శీర్షికలు

సంపాదకీయం	...కలిమిశ్రీ	-5
సాగర వచనం-	...సాగర్ శ్రీరామకవచం	-6
తపాలా	...	-7
కలాలు-కవనాలు	...డా.బీరం సుందరరావు	-13
కవిగారి అంతరంగాలు	...పి.చంద్రశేఖర అజాద్	-14
జీవన మంజూష	...మంజు యనమదల	-21
అవయవదానం-అవగాహన	...డా॥రమణ యశస్వి	-22
కవితలు		-24
రాజకయ్యం	...డా॥ఘంటావిజయ్‌కుమార్	-32
కిటికీ	...జాన్సన్ చోరగుడి	-34
వసుమతీయం	...	-37
ప్రేమలేఖలు	...విడదల సాంబశివరావు	-40
జోక్స్ జోక్స్..	...షేక్ అస్లాం షరీఫ్	-42
వచన కవిత్వం-వస్తువైవిధ్యం	... ఎ.పూర్ణచంద్రశేఖర్‌రావు	-43
పారుగింటి పరిమళం	...పి.శ్రీనివాస్ గౌడ్	-49
కలం యోధుడు	... అన్నవరపు బ్రహ్మయ్య	-50
అవునా..?	...జంధ్యాల రఘుబాబు	-51
రోల్‌మోడల్	...పి.సత్యప్రకాశరావు	-52
కావ్యమల్లిక	... రాధశ్రీ	-53
అరుణక్క సలహాలు	..అరుణ చామర్తి	-53
సాహితీ సమాచారం	...	-54
బుక్‌షెల్ఫ్	....	-57
దుగ్గిరాల గోపాలకృష్ణయ్య	డా॥కేతవరపు రాజ్యశ్రీ...	-58
బౌద్ధసాహితీ సాగరం	...బొర్రా గోవర్ధన్	-62

ముఖచిత్రం : ఆర్‌ఆర్‌ఆర్‌లో రామ్‌చరణ్‌తో జతకట్టిన ఆలియాభట్...'గంగూభాయ్ కతియావాడి'లో సెక్స్‌వర్కర్ల సమస్యలపై పోరాడే ధీరోదాత్త యువతిగా నటించింది.

సీరియల్స్

ప్రేమసౌధం	...పుష్పాల సూర్యకుమారి	-8
నిర్వేదం-	...సాగర్ శ్రీరామకవచం	-46

కథలు

సత్యభామ	...తటవర్తి నాగేశ్వరి	-16
స్ఫూర్తి	...వియోగి	-26
బాలల కథ (న్యాయం)	....కె.శాంతారావు	-36
ఆత్మీయ విందు	..ఆర్‌సి.కృష్ణస్వామిరాజు	-60





కార్టూనిస్టులు : అరుణ్, భగవాన్, వాద్రేవు, జెఎన్నెమ్, బొమ్మన్.


కవులు : విజయ గోలి, కంఠ బంగార్రాజు, మల్లారెడ్డి మురళీమోహన్, షేక్ బషీరున్నీసా బేగం, డా॥కె.జి.వేణు, డా॥ప్రతికంఠం మాలతీలత, శాంతయోగి యోగానంద, అడిగోపుల వెంకటరత్నం, డా॥పాతూరి అన్నపూర్ణ

ఆర్టిస్టులు : బాలి, పి.చిదంబరం, బొమ్మన్

కాట్రగడ్డ దయానంద్

వచన కవిత్వం-వస్తు వైవిధ్యం

-వి.పూర్ణచంద్రశేఖర్‌రావు
98496 52183



నేటి ఆధునిక సాహిత్యకారుల్లో కాట్రగడ్డ దయానంద్ ఒక ప్రత్యేకస్థానం సంపాదించుకున్నారు. దయానంద్ మట్టివాసన తెలిసిన రచయిత. మట్టి వాసన గురించి ఆరాధనతో కాకుండా మట్టి వాసన ఆధారంగా చేసుకుని మానవ సంబంధాలు గురించి కథలు రాయటం దయానంద్ ప్రత్యేకత. దయానంద్ కథలు, కవితలు పరిశీలించినట్లయితే అందులో రైతుల సమస్యలు, వృద్ధుల సమస్యలు, స్త్రీల సమస్యలు, దళిత సమస్యలు వారి జీవన స్థితిగతుల మీద బాగా అవగాహన వున్నట్లు మనకు స్పష్టమౌతుంది. దయానంద్ కథల్లో, కవితల్లో ప్రదర్శించిన కథాశిల్పం, కవితా శిల్పాలను పరిశీలించిన తరువాత సాహిత్యంలో దయానంద్ సుస్థిర స్థానం సంపాదించుకున్నారనటంలో సందేహం లేదు.

కాట్రగడ్డ దయానంద్ 'పండుటాకు', గుండ్లకమ్మ తీరాన...అనే కథా సంపుటాలను మరియు 'మెతుకు' అనే కవితా సంపుటిని రచించారు. ఈ సంపుటిలో '39' కవితా ఖండికలున్నాయి. ఈ కవితా సంపుటిని పరిశీలిస్తే మనకు కొన్ని విషయాలు స్పష్టమౌతాయి.

దయానంద్ ఆధునిక కాలంలో పేరెన్నిక గల కవి. వచన కవిత్వంలో సిద్ధిని, పరిపూర్ణతను, పరిపక్వతను పొందిన ఆధునిక కవుల వర్గంలోకి దయానంద్ కూడా చేరతారు. వచన కవిత్వానికి శ్రీశ్రీ వంటి మహానుభావులు చేసిన సంస్కరణలు, కవిత్వంలో వారు పాటించిన వస్తు వైవిధ్యం, కవితావేశం అన్నీ గుర్రపు స్వారీ చేశాయి. వారి అనంతరం ఆరుద్ర, తిలక్, శేషేంద్ర, సోమసుందర్, అజంతా వంటి కవులు ఎందరో తమతమ వచన కవితల్లో సామర్థ్యాన్ని ప్రదర్శించారు.

ఆధునిక వచన కవులు తమ కవితాశైలి, రచనా విన్యాసం వంటి వాటివల్లనే వచన కవితా ప్రపంచంలో మణిదీపాలై వెలుగొందారు. అద్భుతమైన శైలి, పద ప్రయోగాలు, శబ్ద విన్యాసం, వీరి వచన కవితకి అందమైన ఆభరణాలుగా అలంకరించబడ్డాయి. అయితే దయానంద్ తన వచన కవితను సరళంగా, సజీవంగా వ్యవహారిక శైలిలో నడిపించాలని కోరుకుని అందులో కృతకృత్యుడైనాడు. దయానంద్ తన కవిత్వంలో ప్రయోగించిన శైలి ఆధునికాంధ్ర సాహిత్యంలో వారికి ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరచింది.

దయానంద్ కవిత్వంలో సహజత్వం, స్పష్టత, సరళత వంటి ప్రధాన గుణాలు తన రచనా విన్యాసం, ఆయన వచన కవిత్వంలో మనకు కనిపిస్తాయి. వీరి వచన కవిత్వంలో సంస్కృతి పదభూయిష్టతకు, ఆంగ్ల భాషా ఆడంబరాలకు చోటివ్వలేదు. అలతి అలతి పదాలతో, సహజ వ్యావహారికాలతో వచన కవిత్వాన్ని ప్రదర్శించారు. విపరీతమైన వర్ణనలు వంటివి లేకుండా తెలుగు నుడికారపు సొంపుతో వున్నటువంటి పదాలను, పద బంధాలను తన కవిత్వంలో విస్తరింప చేశారు.

దయానంద్ కవిత్వంలో భావకవిత్వ ప్రభావం, అభ్యుదయ వాదం, అనుభూతి కవిత్వప్రభావం, మానవతా వాద విస్తరణ, స్మృతి కవిత్వం, ధ్వని, వ్యంగ్య వైభవాలు వీరి కవిత్వంలో కనిపిస్తాయి. అలాగే తెలంగాణాలోని ఉద్యమాలు, రాయలసీమలోని కరువు ప్రాంత ప్రజల జీవన దుస్థితిని పరిశీలించి తన కవిత్వంలో సందర్భోచితంగా వ్యక్తపరిచాడు. సమాజంలో వున్నటువంటి కులమత ద్వేషాలు, ఆర్థిక అసమానతలు, సామాన్యుల జీవితాలను గురించి ఆలోచించేవాడు. వారి జీవితాలను సమాజంలో అందరికీ అర్థమయ్యేటట్టు చూపెట్టడం కోసం, వారి జీవిత వ్యధలను చిత్రించటం తన కవితా ధర్మంగా భావించి తన కవిత్వంలో పొందుపరిచాడు.

వస్తు వైవిధ్యం

కాట్రగడ్డ దయానంద్ తన వచన కవిత్వం 'మెతుకు' సంపుటిలో తన చుట్టూ వున్న సమాజంలోని సామాజిక సమస్యలను వస్తువులుగా స్వీకరించారు. కవితా వస్తువుగా సమాజంలో దోపిడీకి గురవుతున్న సమాజాన్ని మరియు వెనుకబాటును ఎదుర్కొన్న మనుషులను, ప్రపంచశాంతి వంటి పలు అంశాలతో వైవిధ్యాన్ని చాటారు. కాట్రగడ్డ దయానంద్ తన కావ్య రచనకు, కావించిన కవితా వస్తువులు ప్రధానంగా రెండు రకాలుగా మనకు దర్శనమిస్తాయి. అవి కవి తన కళ్ళతో చూసిన వాటిని, అనుభూతి చెందిన వాటిని వస్తువుగా స్వీకరించాడు. అంతే కాకుండా మరికొన్ని కవి అంతర్ముఖత్వంగా దర్శించిన వాటిని కావ్య వస్తువులుగా స్వీకరించారు.

సమాజంలో సహజంగా కనిపించే భావాలు మొదటి అంశానికి సంబంధించినవి కాగా మరికొన్ని కవి ఊహా ప్రపంచంలో నుండి జాలువారినవి. వీటన్నింటిని సర్వ మానవ శ్రేయస్సు కోసం ఒక అభ్యుదయ వాదిగా, సంఘంలో వుండే మానవులను, వారి జీవన స్థితిగతులను, వారిలో కనిపించే వైషమ్యాలు, ఆర్థిక అసమానతలు, దేశాల మధ్య వుండే సమస్యలు, అవి తెచ్చి పెట్టే యుద్ధాలు, బాధలు, ఆశలు - నిరాశలు, నిస్పృహలు వంటి వాటన్నింటినీ తన కవితా వస్తువులుగా స్వీకరించారు.

అలాగే సమాజానికి జీవనాధారమైన వ్యవసాయం, దానిని పండించే రైతు దగ్గర నుండి, వారిని దోచుకునే బడా వ్యాపారుల వరకు, మాతృమూర్తి దగ్గర నుండి అంగట్లో బొమ్మలుగా అమ్ముడవు

తున్న స్త్రీమూర్తులు ప్రస్తావన, భావ కవిత్వ భావజాలం, అభ్యుదయం, విప్లవంవాదం, స్త్రీ వాద విషయాలు కలగలసిన ఎన్నో అంశాలు వీరి కవితా వస్తువులుగా దర్శనమిస్తాయి.

కాట్రగడ్డ దయానంద్ కవితా ప్రస్థానంలో అటు రాయలసీమలో వ్యాపించిన కరువు, తెలంగాణా పోరాటాలు, కోనసీమ రైతుల కష్టాలు దేనిని విడిచిపెట్టక, కాదేదీ కవితకు అనర్హం అనిపించారు. వీరి వచన కవిత్వం 'మెదక్' అనే కవితతో ప్రారంభమైంది. ఈ కవితా సంపుటి లోని కవితా వస్తువులను అద్భుతంగా చిత్రించారు.

కాట్రగడ్డ దయానంద్ 'మెతుకు' సంపుటిలో మొదటి కవిత 'మెదక్'. 'మెదక్' తనకు జీవితం నేర్పించిన ప్రాంతం. బ్రతుకు తెరువు చూపిన ప్రాంతం. రచనకు కాలమే కాదు ప్రాంతం కూడా వుంటుంది. పలనాటి సీమలో సంచరించిన శ్రీనాథుడు అక్కడి స్థితిగతులపైన 'పలనాటి వీర చరిత్ర' రాయటం యాదృచ్చికం కాదు. అదే విధంగా అటు పలనాడు ప్రాంతంలోనూ, రాయలసీమలోను జీవించి అక్కడి పరిస్థితులను అవగతం చేసుకున్న దయానంద్ చివరికి 'మెదక్'తో ఆత్మీయంగా కలసిపోయాడు. అక్కడి జీవితాన్ని, దుఃఖాన్నీ, ఉద్య మాన్ని ప్రేమించాడు. అందుకే ఆ 'మెదక్' ప్రాంతాన్ని తన కవితా వస్తువుగా స్వీకరించాడు. 'మెదక్' ప్రాంతంపై తనకున్న ఆసక్తిని, ప్రేమను ఈ నాలుగు మాటల్లో మనం అర్థం చేసుకోవచ్చు.

"అమ్మంత అమాయకమైందే కాదు/ప్రియురాలంత అయో మయమైంది కూడా/నాకు స్తన్యమిచ్చిందీ/లాలించి, బుజ్జగించీ/ మైమరపించీ/నా కౌమార రుతువుల్నీ/దాటించిందీ నువ్వే కదమ్మా"

అంటూ 'మెదక్' ప్రాంతంపై వున్న ప్రేమాభిమానాలను అలతి పదాలతో వర్ణించేందుకు ప్రథమ ప్రాధాన్యతగా కవితా వస్తువుగా స్వీకరించాడు. మెదక్ ప్రాంతంపై అభిమానాన్ని పలు అంశాలతో పోలుస్తూ మరెన్నో ఇతర అంశాలను వివరించి చూపాడు. ఇలాంటి వర్ణనా నైపుణ్యం కాట్రగడ్డ వారికి మాత్రమే సాధ్యం.

అభ్యుదయ మార్గంలో పయనించే కాట్రగడ్డ, ఉద్యమానికి ఊపిరి పోసిన పాటను కవితా వస్తువుగా స్వీకరించారు. ఉద్యమాలలో ప్రజ లను ఉత్సాహవంతంగా పాల్గొనేలా ప్రేరేపించింది విప్లవకారుల పాట.



రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్లకు ప్రకటించిన అవార్డుల్లో గుంటూరు 91వ సచివాలయం, 31వ వార్డుకు చెందిన చిన్నపురెడ్డి సుధ ఉత్తమ సేవావజ్ర అవార్డును పొందారు. గోల్డ్ మెడలు, ప్రసంసాపత్రం, 30 వేల రూపాయల నగదును ఇచ్చి మెట్టు కృష్ణారెడ్డి కళ్యాణమండపంలో సత్కరిస్తున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరి. చిత్రంలో స్థానిక వార్డు కార్పోరేటర్ సంతోష్ కూడా వున్నారు.

పాట మనిషికి సత్తువను ఉత్తేజాన్నిస్తుందనటంలో అతిశయోక్తి లేదు. అలాంటి పాటను కవితా వస్తువుగా స్వీకరించారు. 'నాకిప్పుడు పాట వినాలని ఉంది' 'చావులేని పాట' గీతం కోసం అంటూ పాటకోసం తనలో వున్న ఆరాటాన్ని కావ్య వస్తువుగా స్వీకరించారు. పాటకు మరణం వుండదు. సమాజంలోని సమస్యలను దర్శించిన కవి మనస్సు ఛిద్రమైంది. దాని నుండి ఓదార్పు కోసం పాటను ఆశ్రయించాలను కున్న హృదయ భావన కూడా కార్యవస్తువైంది. ఈ పాట సమస్తమంతా వ్యాపించి వుందని, కవి ఈ కవితలో చూపిస్తున్నాడు.

"నా గీతం నాక్కనబడదు/నా గీతం నాకే కనబడనప్పుడు/శిరస్సు మీద ఆకాశం విరిగిపడ్డా బాగుండు/సముద్రం అలల్తో నన్ను ముం చేసినా బాగుండు/భూమి నెర్రెలిచ్చి నన్ను తనలో ఇముడ్చుకున్నా బాగుండు/భరించలేని అశాంతితో/రోడ్డు మీద ప్రవాహంలా సాగి పోతా" నంటూ పాటలేని జీవితం భరించలేనితనాన్ని వైవిధ్య భరి తంగా చూపాడు.

కాట్రగడ్డ దయానంద్ మాతృమూర్తి యొక్క గొప్పతనాన్ని కవితా వస్తువుగా స్వీకరించి వర్ణించాడు. అమ్మంటే ఒక ఆత్మీయ స్పర్శ. ఆకలితో వచ్చిన వారికి అక్షయపాత్ర వంటిందని తల్లి పాత్రను రమణీయంగా తీర్చిదిద్దాడు.

"అమ్మ చేతుల్లో ఎన్ని వెన్నముద్దలుండేవో
మోకాళ్ళతో పరుగెత్తి ఆమె ఒళ్ళో వాలేవాణ్ణి
అమ్మగుండెల్లో ఎంత అమృతం ఉండేదో
ఏడుస్తూనే ఆమె ఒక్కో నెత్తుటి బొట్టును పీల్చేవాణ్ణి
సముద్రమంత అమ్మ ఎంత దూరాన ఉన్నా
ఆమె కెరటాల చేతుల్లో ఉయ్యాలలూగడానికి ఆరాటపడే వాణ్ణి".

అంటూ అమ్మ ప్రేమను గూర్చి వర్ణించారు. అమ్మంటే అద్భుత జ్ఞాపకం, పిల్లల్ని కనటానికి తల్లి కడుపు పడే శ్రమను, ఆమె ప్రేమను కొలవటం, అసాధ్యమని వివరిస్తూ, కాట్రగడ్డ తల్లి ప్రేమను కవితా వస్తువుగా చిత్రించారు.

కాట్రగడ్డ 'చల్‌చల్ గుర్రం' అనే కవితా ఖండికలో స్త్రీలు, ముఖ్యంగా గృహిణులు ఎదుర్కొనే శారీరక, మానసిక హింసలను కవితా వస్తువులుగా చిత్రించారు.

"పెచ్చులూడిపోయిన/వీపుని బుజ్జగించే సున్నిత వాత్సల్యమేదీ!/ సిగరెట్ వాతాలతో బొబ్బలెక్కిన/చేతుల్లో స్పర్శే ఉండదు/ఒళ్ళంతా కాలి ప్రాణమొక్కటే మిగిలి/పుట్టింటికి చేరిన చేతులు అసలే స్పృశిం చవు/మొరటు దేలిన/వంటింటి బందీ చేతులకు స్పృశించే తీరికే దొరకదు."

ఎన్నో గృహాలలో కోడళ్ళు ఎదుర్కొనే కష్టాలు ఇవి. క్రూర స్వభావం గల భర్తల చేతిలో బందీలుగా చిక్కి శారీరక హింసను ఎదుర్కొనే వారి జీవితాన్ని కవితా వస్తువుగా చిత్రించారు. అలాగే 'మహానగరాభి నిష్క్రమణం' కవితలో కూడా స్త్రీలు ఎదుర్కొనే కట్న సమస్యను కవితా వస్తువుగా స్వీకరించారు. పెళ్ళనగానే ఆడపిల్లను అలంకరించి అంగట్లో బొమ్మలుగా పెడతారు. లక్షల కొద్దీ కట్నం పోసి, కర్కోటకుడి చేతుల్లో పెడుతున్నారనే భావాన్ని తెలియచేస్తూ కవితా వస్తువుగా వైవిధ్య భరితంగా చూపించారు.

చదువుతుంటే నిజమైన కథ పల్లెలోనే ఉండిపోయిందని పిస్తుంది. నగరం మేలి ముసుగులు గ్రామీణ ప్రాంతానికి గిట్టవేమీ అనిపిస్తుంది. తాను కథ వెనుక ఉన్నాననే స్పృహ కల్పించకుండానే పాఠకుడితో కథలు చదివింప గల నేర్పు సాధించిన మంచి కథా రచయిత దయానంద్. ఈయన శైలి ఏ నగిషీలూ నాజూకులూ లేకుండా సహజంగా చదివించుకు పోతుంది. దయానంద్ గారి కథలు పల్లె బతుకులకు అద్దం పట్టే కథలని, పల్లె చెప్పిన కథలని, గ్రామీణ జీవన చిత్రణ నడుస్తున్న చరిత్ర అని, మట్టి మనుషుల జీవితాల్ని దోసిట పట్టిన ఇతివృత్తాలని, మట్టి వాసనను గుబాళించే కథలని, మనసుని చిత్రించే కథలని .. సాహితీవేత్తలు పేర్కొన్నారు. దయానంద్‌గారి కథలు గ్రామాల్లో ని మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి జీవితాలకు నిలువెత్తు అద్దాలు. పల్లె జీవితాలతో మమేకమైన రచయితలు తప్ప చిత్రించలేని అద్భుత గ్రామీణ వాతావరణ చిత్రణ ప్రతి కథలోనూ కనిపిస్తుంది. మనిషి వాసనకి, మట్టి వాసనకు ప్రతీకలు ఈ కథలు. కథల్లోని సంఘటనలూ, పాత్రలూ పాఠకుడి మనసు మీద బలంగా ముద్రవేస్తాయి.

దయానంద్ తన ఉద్యోగరీత్యా కూడా ప్రకాశం జిల్లా పల్లెటూళ్ళు, పట్టణాలలో మనుషుల జీవితాల్ని చాలా దగ్గరగా పరిశీలించారు. తన కథల్లో పాత్రలు, వాళ్ళుండే చోట్లు, వారు చేసే పనులూ ఆయనకు చాలా పరిచయం. అందుకే ఈ కథల వాతావరణంలో అంత సహజత్వం ఉంటుంది. దయానంద్ గుండ్లకమ్మ నదీ తీరప్రాంతాల్లో వచ్చిన మార్పులకు ప్రత్యక్ష సాక్షి. ఆ నేపథ్యంలో జీవితాలు, మానవ సంబంధాలు ఎలా మారుతున్నాయో తెలిసి చలించిన రచయిత. ఒకప్పుడు స్వతంత్రంగా ధైర్యంగా జీవించిన చిన్న రైతుల జీవితాలు అస్తవ్యస్తం కావడం, పెద్దవాళ్ళ వ్యాపారాల కోసం, చిన్నవారు భూములు అమ్మేసుకోవాల్సి రావడం ఆయన దగ్గరగా చూశాడు. భూమితో రైతుకి ఉన్న సంబంధం రైతు బిడ్డలకు లేకపోవడం గమనించాడు. వాటిని తన కథల్లో అద్భుతంగా చిత్రించారు. ఆ కథలన్నీ ఆర్తిగా, ఆత్మీయుల కబుర్లు, మంచీ చెడ్డా చెప్పినట్టు ఉంటాయి. ఆ కథల్లో పాత్రలు రక్తమాంసాలతో నిజం మనుషుల్లా ఉంటాయి. సగటు మనుషుల బంధాలూ, బాంధవ్యాలూ, బాధ్యతలు కలిగి ఉంటారు. వాళ్ళు అంతంత మాత్రం నిరాశకు లొంగేవారు కాదు. బతుకు లడాయిలో ధక్కా ముక్కలు తిన్నవాళ్ళు. తుపానుల ముందు తలవంచినా, పరిస్థితుల కొరడా దెబ్బలకి నడుం విరిగినా, తిరిగి నిటారుగా నిలబడి భవిష్యత్‌పై ఆశతో, ఆత్మ విశ్వాసంతో తలెత్తి ముందుకు సాగేవాళ్ళు. బతకటంలో విశ్వాసం ఉన్నవాళ్ళుగా మనకు కనిపిస్తారు.

దయానంద్ కథల్లోని పాత్రలు మనల్ని నిశ్చేష్టుల్ని చేస్తాయి. ఈ కథకుడు కథల్లో తానో పరాయివాడుగా ఉంటూ పాత్రల్లోకి ప్రవేశించి మనల్ని అగాధాల్లోకి తోసేస్తాడు. ఇలా ఉంది జీవితం.. ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటని ఓ బైరాగిలాగా నిష్క్రమిస్తాడు. ఆయన కథల వెనుక యథార్థ వ్యధలు కోకొల్లలు. 'పండుటాకు' సంపుటిలో గాని, గుండ్లకమ్మ తీరాన కథా సంపుటిలో గాని వర్తమాన దు:ఖ వాతావరణాన్నీ దృశ్యాలు దృశ్యాలుగా విప్పటానికి చేసిన అతి సున్నితమైన మేధోచర్యని మనం గమనించవచ్చు. ఇవి పది కాలాలపాటు వెన్నాడే కథలు. ఓ రైతు బిడ్డగా, గ్రామీణ పక్షపాతిగా ఎక్కడ నిలబడాలో తెలుసుకోవటంతో ఈ రచయిత తన చారిత్రక కర్తవ్యాన్ని సరిగ్గానే నెరవేరుస్తున్నాడు. ఆయన పాత్రలు ఏ రాజకీయాలూ మాట్లాడవు. గాంధీలా సత్యాగ్రహం చేస్తాయి. దండయాత్రలు చేస్తాయి. ఎక్కడా దుస్సాహసికులు, పిరికివారు కనిపించరు. ఈ దేశంలో మేమూ మనుష్యులమే – అని చెప్పే విధంగా పాత్రలు మనకు కనిపిస్తాయి. సరిగ్గా ఇక్కడే ప్రేమ్‌చంద్ వారసుడుగా కనబడతాడు. ప్రేమ్‌చంద్ మాదిరి ఓ సంయమన రచయిత దయానంద్. 'ప్రేమ్‌చంద్‌ని, దయానంద్‌ని పక్క పక్కన కూర్చోబెడితే ఆశ్చర్యంగా ఇద్దరూ ఒకరే అనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో ప్రేమ్‌చంద్ వారసుడిగా, దయానంద్ కథల్ని పరిశీలించాల్సిన అవసరం వర్తమాన పరిశోధకుల మీద ఎంతో ఉంది' అని సాహితీవేత్త శ్రీరామ కవచం సాగర్ వ్యాఖ్యానించారు.

తక్షణ సంఘర్షణలకి వెంటనే స్పందించి కథలు రాసే ఒడుపుని సంతరించుకొన్న దయానంద్ కొన్ని వర్తమాన సంఘటనలను అద్భుత కథలుగా మలిచారు. ఇందులో 'అలజడి', 'నేల తిమ్మిరి', 'గుండ్లకమ్మ తీరాన', 'అతడు–ఆమె', 'ఒక స్వప్నలోకం', 'పండుటాకు', 'శిశిరం', 'నీడ', 'మనిషీ – మట్టి', 'ఆకురాలు కాలంలోకి – లాంటి కథలు ఇందుకు ఉదాహరణలు. ఇలాంటి కథలను దయానంద్ మాత్రమే రాయ గలరు. 'వస్తువే శిల్పమై అల్లుకుపోవడం మంచి కథకుల లక్షణం. సాహిత్యకారుని జిజ్ఞాసకూ, స్వీకరించే జీవితానికి సామరస్యం కుదిరినప్పుడు కథలు సలక్షణంగా గుబాళిస్తాయి. కాట్రగడ్డ దయానంద్ ఈ అరుదైన సామరస్యానికి చక్కని ఉదాహరణ' అని సాహితీవేత్త పసునూరి శ్రీధర్ అన్న మాటలు ఆయన కథల్లో అడుగడుగునా మనకు స్ఫురణకు వస్తాయి. ■

అటు పలనాడు ప్రాంతంలోనూ, రాయలసీమలోను జీవించి అక్కడి పరిస్థితులను అవగతం చేసుకున్న దయానంద్ చివరికి 'మెదక్'తో ఆత్మీయంగా కలసిపోయాడు. అక్కడి జీవితాన్ని, దుఃఖాన్నీ, ఉద్యమాన్ని ప్రేమించాడు.

అలాగే కాట్రగడ్డ 'మొలైసీ స్మృతి'లో అనే కవితా ఖండికలో ప్రపంచ విప్లవ యోధుడు బెంజమిన్ మొలైసీ త్యాగాన్ని కవితా వస్తువుగా చిత్రించారు.

జైలు నాలుగ్గోడల మధ్య/తుపాకీ బాయినెట్‌ల కాపలాలో/వెన్నెల కోసం, వెల్తురు కోసం/స్వేచ్ఛకోసం, చారెడు మట్టికోసం/కలాన్ని ఆయుధం చేసినందుకు/భూమ్యాకాశాల్ని ఉరితీసినట్టుగానే/బెంజిమెన్‌ని ఉరితీశారు." అంటూ స్వేచ్ఛకోసం పోరాడి, కలాన్ని ఆయుధంగా చేసుకుని పోరాడిన వీరుల జీవితాలను కాట్రగడ్డ దయానంద్ కవితా వస్తువుగా స్వీకరించారనటానికి ఇది మంచి ఉదాహరణ.

కాట్రగడ్డ దయానంద్ కవిత్వంలో 'ఉదయం' చూపులు వెంటాడుతాయి. 'ఋతుగానం' వంటి విషయాలు కూడా కావ్యరూపాన్ని తొడుక్కున్నాయి. యుద్ధం వల్ల కలిగే వినాశాలను వివరిస్తూ రాయబడ్డాయి. భాగల్పూర్ ప్రాంతం నుండి పశ్చిమ దేశాల్లోని పాలస్తీనా వరకు వున్న యుద్ధ ప్రభావిత ప్రాంతాలను కావ్య వస్తువులుగా స్వీకరించారు.

దయానంద్ 'చూపులు వెంటాడుతాయి' అనే కవితా ఖండికలో కూడా యుద్ధంలో పాల్గొనే వీరుడు, వాళ్ళ దగ్గర నుండి కన్నెపిల్ల చూపుల వరకు వేటిని వెదుకుతాయి అనే అంశాలను కవితా వస్తువుగా స్వీకరించారు. ఈ ఖండికలో అమూర్త చూపులను, మూర్తివంతం చేస్తూ చూపుల స్వభావాన్ని ఒక్కొక్కరికి మధ్య వుండే వ్యత్యాసాన్ని కావ్య వస్తువుగా స్వీకరించి వివరించారు.

దయానంద్ వృత్తిరీత్యా పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నారు. తనకు జీవనభృతిని కల్పించిన తపాలా వ్యవస్థను, కవితా వస్తువుగా స్వీకరించి 'తపాలా గీతం' అనే కవితను రాశారు. ఈ ఖండికలో తపాలా వ్యవస్థ చిరుద్యోగిగా చేరినప్పుడు తానుపడిన బాధలను, పోస్టాఫీసు స్థితిగతులను చక్కగా వివరించారు. అలాగే సమాజంలో ప్రభుత్వం ఉక్కు పాదాలు మోపుతూ విధించే కర్ఫ్యూ కూడా కవితా వస్తువుగా చిత్రించబడింది. 'కర్ఫ్యూ పాదుగు కింద' అనే కవితలో ప్రభుత్వం ఇనుప నాడా బూట్ల బరువు, పాదుగు క్రింద నగరం, అనే పదాలు కవితలో స్థానం సంపాదించుకున్నాయి.

కాట్రగడ్డ ఇలా తన వచన కవిత్వంలో ఒక ప్రత్యేకతను చూపెడుతూ ఈ లోక సంబంధమైన చిన్న చిన్న సంఘటనలను, చిన్న చిన్న విషయాలను కావ్య వస్తువులుగా గ్రహించి, సామాజిక స్పృహతో తన కవిత్వాన్ని అందంగా తీర్చిదిద్దాడు. ఇలాంటి విషయాలు అటు మానవులను, వారు ఎదుర్కొనే సమస్యలను, ప్రపంచాన్ని చుట్టుకొని వున్న భయంకర పరిస్థితుల్ని అర్థమయ్యేలా చూపించారు. కాట్రగడ్డ బాహ్య ప్రపంచంలో దర్శనమిచ్చే వస్తు జాలాన్ని మాత్రమే కాకుండా ప్రజల మనోభావాలను, అమూర్త విషయాలను, తాను దర్శించిన దృశ్యభావాలను ఇతివృత్తాలుగా చేసుకొని తన కవిత్వంలో వస్తు వైవిధ్యాన్ని ప్రదర్శించారు. ✶

